క్లుప్తంగా

వైఎస్‌ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే తలారి



తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డితో కో ఆర్డినేటర్‌ వెంకట్రావు

తాళ్లపూడి: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌ సీపీ అధినేత వై.ఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని మంగళవారం కొవ్వూరు నియోజకవర్గ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ అనుబంధ కమిటీలు, తదితర అంశాలపై ఆయన చర్చించరన్నారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధినేత సూచించి నట్లు తలారి పేర్కొన్నారు.

స్మార్ట్‌ రేషన్‌ కార్డుల పంపిణీ



స్మార్ట్‌ కార్డులను చూపుతున్న లబ్ధిదారులతో సర్పంచ్‌ గాంధీ, అధికారులు

దేవరపల్లి: రేషన్‌ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్‌ కార్డుల పంపిణీ ఈ నెల 31 వరకు ఇంటింటికీ, సెప్టెంబరు 1 నుంచి రేషన్‌ దుకాణాల వద్ద కార్డుల పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బంధపురం గ్రామంలో మంగళవారం సర్పంచ్‌ కాట్రగడ్డ గాంధీ అధ్వర్యంలో కార్డుల పంపిణీ చేపట్టారు. మండల వ్యాప్తంగా 26,676 స్మార్ట్‌ కార్డులు పంపిణీ చేయవలసి ఉండగా, మంగవారం నాటికి సుమారు 2,495 కార్డులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.సురేష్‌, వీఆర్వో కె.వెంకటేశ్వరరావు, మండల రేషన్‌ డీలర్ల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతికి అడ్డుకట్ట



బ్రాహ్మణగూడెంలో కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

చాగల్లు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం క్యూఆర్‌ కోడ్‌ ఆధారిత స్మార్ట్‌ రేషన్‌ కార్డులను అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. బ్రాహ్మణగూడెంలో కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వీఆర్‌వో ఎ.రామకృష్ణ, ఎంపీటీసీ ప్రత్తిపాటి వెంకటేశరరావు మాట్లాడుతూ గ్రామంలో 1,934 స్మార్ట్‌ కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. కార్డుదారులు తమకు కేటాయించిన రేషన్‌ దుకాణల్లో కార్డులు తీసుకోవాలని సూచించారు. స్మార్ట్‌ రేషన్‌ కార్డుల వలన ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న క్లబ్‌ సభ్యులు

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో మదర్‌థెరిసా జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని సంఘమిత్రా స్కూలు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, అనంతరం పేదలకు దుప్పట్లు అందజేశారు. గంటావారిగూడెంలో సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న నాగరాజు దంపతులు ఇటీవల ఆగస్టు 15న కలెక్టరు పి.ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న నేపథ్యంలో దంపతులను నూతన వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌ డిస్ట్రిక్ట్‌ చైర్‌పర్సన్‌ అంబటి శ్రీనివాసరావు, దూబచర్ల లయన్స్‌ క్లబ్‌ మాజీ అధ్యక్షుడు కెల్లావాసు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

గోపాలపురం: విద్య,వైద్యానికి మానవత స్వచ్ఛంద సంస్థ పెద్దపీట వేస్తుందని మండల మానవత చైర్మన్‌ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. గోపవరం గ్రామంలో మంగళవారం ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై సంస్థ తరపున ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. సుమారు 250మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ యండపల్లి శేఖర్‌బాబు, మానవత సభ్యులు గెడ జోగేంద్రప్రసాద్‌, జె.సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఏకదంతాయ..వక్రతుండాయ

- నేటి నుంచి గణపతి ఉత్సవాలు
- పూజలందుకోనున్న బొజ్జ గణపయ్య
- పోటాపోటీగా మండపాల ఏర్పాటు



తాళ్లపూడిలో ఓ దుకాణంలో మట్టి వినాయక విగ్రహాలు

తాళ్లపూడి: పల్లె నుంచి పట్టణం వరకు వినాయక చవితి సందడి మొదలైంది. ఉత్సవ కమిటీలు మండపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్లాస్టిక్‌ విగ్రహాల స్థానంలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరుతున్నా, యువత మాత్రం రంగుల విగ్రహాల కొనుగోలుకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. పండుగ సన్నాహాలు, విగ్రహాల తయారీ, పందిళ్ల ఏర్పాటు, కార్యక్రమాలతో ఊరువాడ ఉత్సాహం నెలకొంది. జోన్‌ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం మూడు నియోజకవర్గాల ప్రధాన కూడళ్లలో విగ్రహాలు పెట్టడానికి మండపాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. పూజా సామగ్రి, పత్రి, పాలవెల్లులు, గొడుగులు, పళ్లు, పూలు తదితర పూజాసామాగ్రి కొనుగోలు చేసే వారితో ప్రధాన మార్కెట్లు కళకళలాడుతున్నాయి.

పెరిగిన ధరలు..

చవితి సందర్భంగా మార్కెట్లు కిక్కిరిస్తున్నాయి. ఈ సంవత్సరం ధరలు అధికంగా పెరిగినా కొనుగోలు దారులు వెనుకడుగు వేయడం లేదు. చిన్న సైజు వినాయక విగ్రహం రూ.20 నుంచి రూ.300, రూ.500, 600 వరకు ధరలు పలుకుతున్నాయి. పూజలో వాడే గొడుగులు రూ.15 నుంచి రూ. 25 ,



కొవ్వూరు పట్టణంలో సందడిగా మారిన మార్కెట్‌

పూలమాలలు రూ.100 నుంచి రూ.180, యాపిల్‌ నాలుగు రూ.100, బత్తాయి రెండు రూ.30,



మట్టి ప్రతిమలను ఉచితంగా అందజేస్తున్న ట్రస్ట్‌ సభ్యులు

దానిమ్మ రెండు రూ.40 ద్రాక్ష కిలో రూ.120, వెలగకాయ రూ. 20, సీతాఫలం రూ.15, మారేడుకాయ రూ.15, మొక్కజోన్న రూ.10, నారింజ రెండు రూ.20 ,అరటిపళ్ల డజను రూ.40 నుంచి రూ.80 వరకు అమ్మకాలు సాగుతున్నాయి. 9 రకాల పత్రి కట్ట రూ.30 వరకు ధరలు పలుకుతున్నాయి. చామంతి 15 పుష్పాలు రూ.40లకు విక్రయిస్తున్నట్లు కొనుగోలుదారులు తెలిపారు.

నిబంధనలు పాటించాలి...

చవితి మండపాల వద్ద నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కొవ్వూరు రూరల్‌ సీఐ విజయబాబు, తాళ్లపూడి ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. తాళ్లపూడిలో ఉత్సవ నిర్వాహకులకు మంగళవారం అవగాహన కల్పించారు.

మట్టి ప్రతిమలే మేలు

దేవరపల్లి: పూజల అనంతరం రంగులు వేసిన ప్రతిమలను చెరువులు, కాలువలు, నదుల్లో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణం కలుషితమవుతుందని మండల కేంద్రం దేవరపల్లిలోని పెడసనగంటి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో 600 మట్టి ప్రతిమలను తయారు చేయించి భక్తులకు పంపిణీ చేస్తున్నట్టు ట్రస్ట్‌ వ్యవస్థాపకులు పెడసనగండి సాయిబాబు, శశికాంత్‌ శర్మ తెలిపారు. మంగళవారం మెమోరియల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో సుమారు 600 మంది భక్తులకు పరమేశు బయోటెక్‌ ప్రవేట్‌ లిమిటెడ్‌ పరిశ్రమ అధినేత తేతలి ఉపేంద్రరెడ్డి, ఎండీ ఆనంద్‌ స్వరూప్‌ చేతుల మీదుగా భక్తులకు అందజేశారు. తమ సంపాదనలో ఎంతో కొంత సమాజానికి ఉపయోగించాలనే ఆలోచనలో ప్రతి ఏటా ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్‌ నిర్వాహకులు తెలిపారు.

మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనను ప్రోత్సహించాలి

రంగులతో తయారు చేసే కృత్రిమ విగ్రహాలను నిమర్జనం చేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలకు పూజలు చేయాలన్న ఉద్దేశంతో తాళ్లపూడిలో మంగళవారం రత్నగణేష్‌ సూపర్‌ మార్కెట్‌ ఆధ్వర్యంలో 100 మట్టి ప్రతిమలను ఉచితంగా అందజేశారు. పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించి, మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనను ప్రోత్సహిస్తున్నామన్నారు.

వాడవాడలా ఏర్పాట్లు

చాగల్లు: వినాయకచవితి ఉత్సవాలకు విశిష్టత సంతరించుకున్న చాగల్లులో రెండు ఉత్సవాల కమిటీల ఆధ్వర్యంలో చవితి ఏర్పాట్లు భారీగా చేశారు. మండల వ్యాప్తంగా వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. విద్యుద్దీపాలంకరలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, చిక్కాల, మార్కొండపాడు, మీనానగరం, కలవలపల్లి, నెలటూరు తదితర గ్రామాల్లో వీధివీధిన చవితి మండపాలు ఏర్పాట్లలో యువకులు ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఒక పక్క వర్షం కురుసిన భక్తులు కొనుగోలుతో మార్కెట్‌ కిక్కిరిసింది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు



కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాయక్‌

దేవరపల్లి: ప్రమాదాలు జరగకుండా, శాంతి భద్రతలకు భంగం కలుగకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించాలని ఉత్సవాల నిర్వహక కమిటీ సభ్యులకు సీఐ బీఎన్‌ నాయక్‌ సూచించారు. స్థానిక కాకర్ల కళ్యాణ మండపంలో మంగళవారం మండలంలోని చవితి ఉత్సవాల నిర్వహక కమిటీ సభ్యులకు నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. తీసుకున్న అనుమతులు ప్రకారం చెప్పిన ప్రదేశంలో మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలను అనుమతించరాదని రంగులు చల్లడం, బాణాసంచా పేల్చడం వంటివి చేయరాదన్నారు. ట్రాఫిక్‌ నియంత్రణకు వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నియమాలకు సంబంధించి వాల్‌ పోస్టర్‌ను సీఐ ఆవిష్కరించారు. పోస్టర్లను ఉత్సవాల మండపాల వద్ద అతికించాలని కమిటీలకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్సై వి.సుబ్రహమణ్యం, సిబ్బంది, ఉత్సవాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడండి



చెరువుల సంరక్షణపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న జేఏసీ సభ్యులు

దేవరపల్లి: మండల పరిధిలోని ఆక్రమణలకు గురైన చెరువులను సర్వే చేయించి కాపాడాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింగ్‌ యాక్షన్‌ కమిటీ సభ్యులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలో ఎన్ని ప్రభుత్వ చెరువులు ఉన్నాయి, వాటి విస్తీర్ణం, ఆయకట్టులో గల యజమానుల వివరాలను తెలియజేయాలన్నారు. చెరువులను ఆక్రమించి శాశ్వత నిర్మాణాలను కట్టకూడదన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తు దేవరపల్లిలో చెరువులను ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారని జేఏసీ సభ్యులు ఇచ్చిన అర్జీలో పేర్కొన్నారు. వెంటనే ఆక్రమణలను తొలగించి చెరువులను పరిరక్షించాలని కమిటీ సభ్యులు దున్నా సుమన్‌ బాబు, పల్లికొండ సురేష్‌ కుమార్‌, మడతల శంకరం, తదితరులు తహసీల్దార్‌ను కోరారు.

జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి



సేవా పురస్కారం పొందిన అధికారులను సత్కరిస్తున్న ప్రెస్‌క్లబ్‌ సభ్యులు

తాళ్లపూడి: నిరంతరం ప్రజల సమమస్యల పరిష్కారానికి కృషి చేసే అధికారులుకు, జర్నలిస్టులు అందజేస్తున్న సహకారం, సేవలు వెలకట్టలేనివని కొవ్వూరు రూరల్‌ సీఐ విజయబాబు అన్నారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న అధికారులను ఏపీడబ్ల్యూజేయు, తాళ్లపూడి ప్రెస్‌క్లబ్‌ ఆధ్వర్యంలో తాళ్లపూడిలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కొవ్వూరు రూరల్‌ సీఐ విజయబాబు, తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ, ఎంపీడీవో వేణుగోపాల్‌ రెడ్డి, ఎంఈవో సీహెచ్‌ నెహ్రూజీ, గోపాలపురం ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, అన్నదేవరపేట పీహెచ్‌సీ డాక్టర్‌ స్వర్ణలత, ఏపీఎం మంగాయమ్మ, ఎంఐఎస్‌ శ్రీనివాస్‌, హెల్త్‌ సిబ్బందిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్‌ చైర్మన్‌ అప్పనరాజా, క్లబ్‌ అధ్యక్షుడు జేవీ ప్రమోద్‌ కుమార్‌, సభ్యులు అనంతం రామకృష్ణ, ఎం.సత్యనారాయణ, అప్పనచంద్ర గుప్త, జీ.బ్రహ్మానందం, కె.శ్రీనివాస్‌, ఎన్‌.గోపాలకృష్ణ, కె.ఉదమ భాస్కర్‌, కొల్లి. చినబాబు, నాగేంద్ర, ఎంఈవో సీహెచ్‌ బాలామణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ హితుడు



కళకారుడు తయారు చేసిన మట్టి విగ్రహం

తాళ్లపూడి: వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి విఘాతం కలిగించకుండా మట్టి ప్రతిమలతో అందరు పూజలు చేయాలన్న ఉద్దేశంతో తాళ్లపూడి గణపతి యువజన సంఘానికి చెందిన శింగం శివ గత కొద్ది సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను తయారు చేస్తు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ ఏడాది మూడు మండపాలకు మూడు భారీ మట్టి వినాయకుడి విగ్రహాలను అందించాడు. ప్రైవేట్‌ ఉద్యోగి అయిన శివ ఖాళీ సమయంలో విగ్రహాలను తయారు చేసి ఉచితంగా అందిస్తున్నాడు.

సంక్షేమాన్ని అటకెక్కించిన కూటమి

- 15 నెలల పాలనలో అన్నీ దారుణాలే
- హామీల పేరుతో మహిళలకు వంచన



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు



నందిగంపాడులో బాబూ మోసాలను వివరిస్తున్న తలారి వెంకట్రావు

చాగల్లు: ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి మరోసారి చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నందిగంపాడు, ఎస్‌.ముప్పవరం గ్రామాల్లో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు కుదప రాంబాబు, ముప్పిడి మహాలక్ష్మడు అధ్యక్షతన జరిగిన ఈ సభల్లో చంద్రబాబు 15 నెలల పాలనలో దారుణలు, మోసాలను మాజీ ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ చంద్రబాబు తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం పథకాలతో మహిళలను వంచించారన్నారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో వైద్యం, వ్యవసాయ రంగాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని మండిపడ్డారు.

కుటుంబాలను రోడ్డెక్కించారు

రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పుల పాలు చేసిందని, దాదాపు ఏడు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగ్గొటారని ఆరోపించారు. ఈ నాలుగేళ్లలో కేవలం మహిళలకు సుమారు రూ.8 వేల కోట్లు మాత్రమే కూటమి ప్రభుత్వం కేటాయిస్తుండగా...గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం మహిళలకు వివిధ పథకాల ద్వారా సుమారు రూ.1.26 లక్షల కోట్లు అందించిందన్నారు. 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేసిందని, ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో 9,280 మంది ఆపరేటర్లు వీధిపాలయ్యారని తలారి అన్నారు. పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పరిమిసోమరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, కొవ్వూరు పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా ఆర్‌టీఏ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్‌ ఉప్పులూరి సూరిబాబు, నాయకులు బొర్రా కృష్ణ, చిలీ ప్రసాద్‌, ఉన్నమట్ల బ్రాహ్మనందం, వుండవల్లి శ్రీనివాసరావు, మేకా సురేష్‌, కె.సుబ్బలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మదర్‌ థెరిసా సేవలు వెలకట్టలేనివి



మదర్‌ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

నిడదవోలు రూరల్‌: తోటి వారికి సాయం చేయడానికి తన వ్యక్తిగత జీవితాన్ని త్యజించిన త్యాగమూర్తి మదర్‌ థెరిసా అని బాబు యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం. రాజారత్నం కొనియాడారు. సమిశ్రగూడెం గ్రామంలోని శాంతి సెంటర్లో థెరిసా 115వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీ రమేష్‌ మాట్లాడుతూ మదర్‌ థెరిసా జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామ్మోహనరావు, నాయకులు ఎండి అక్రమ్‌ చెరుకూరి యూత్‌ సభ్యులు పాల్గొన్నారు.

పచ్చని పంట ధ్వంసం



కలుపు మందు పిచికారీతో నాశనమైన వరి పంట

నల్లజర్ల: ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ కారణంగా పచ్చని పంట పైరును ధ్వంసం చేసిన ఘటన పోతవరంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాగోలు ఏడుకొండలుకు పోతినీడు పాలెం పొలిమేర పుంత వద్ద రెండు ఎకరాలు వ్యవసాయ భూమిని సాగు చేస్తున్నారు. ఎంతో కష్టపడి దుక్కిదున్ని నీరు పెట్టి సాగు చేస్తున్న సమయంలో ఆక్రోశంతో పొట్టదశలో ఉన్న పంటపై రాత్రికి రాత్రి కలుపు మందు పిచికారీ చేసి పంటను నాశనం చేసినట్టు బాధిత రైతు నాలుగురోజుల క్రితం ఏడుకొండలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.1లక్ష నష్టం వాటిల్లిందని, పొలం పరిసరాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయని అనుమానితుల జాడ చెప్పిన పోలీసులు ఇంతవరకు ఎటువంటి చర్య తీసకోలేదని బాధితుడు ఆరోపిస్తున్నాడు.

వినాయకుడి ఆకృతిలో ప్రదర్శన



వినాయకుడి ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

తాళ్లపూడి: వినాయక చవితిని పురస్కరించుకుని తాళ్లపూడిలోని మాంటిస్సోరీ హైస్కూల్‌ వద్ద మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు వినాయకుడి ఆకృతిలో కూర్చొని విద్యార్థులు అబ్బుర పరిచారు. ఈ మేరకు విద్యార్థుల ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. కరస్పాండెంట్‌ వీవీ అనీష్‌ మాట్లాడుతూ విద్యార్థులకు భారతీయ పండుగల విశిష్టతను తెలియజేయాలన్న ఉద్దేశంతో సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తునట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహం మేలు

నిడదవోలు: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను భక్తులు ఉపయోగించాలని కౌన్సిలర్‌ చిలకల శారదాదేవి పేర్కొన్నారు. పట్టణంలో గాంధీబొమ్మ సెంటర్‌లో మంగళవారం చివితి సందర్భంగా చిలకల మల్లికార్జునరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన 100 వినాయక మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు పంపిణీ చేయాలని కోరుతూ రోటరీక్లబ్‌ ఆఫ్‌ నిడదవోలు శాఖకు మరో 100 మట్టి ప్రతిమలను సభ్యులకు అందజేశారు.

దారంతా.. దారుణం

- వర్షాలకు ధ్వంసమైన రహదారులు
- దెబ్బతిన్న కల్వర్టులు



పల్లంట్ల-యర్నగూడెం రోడ్డులో కొట్టుకుపోయిన కల్వర్టు



వర్షాలకు ధ్వంసమైన దేవరపల్లి-పల్లంట్ల రోడ్డు

దేవరపల్లి: కొవ్వూరు డివిజన్‌లోని మెట్ట ప్రాంతంలో గత పది రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు పలు ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. రోడ్లపై గుంతలు పడి గోతుల్లో నీరు చేరి ప్రయాణికులు అంచనా వేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఏలూరు-గుండుగొలను-కొవ్వూరు (ఈజీకే) ప్రధాన రహదారి వర్షాలకు గుంతలు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవరపల్లి-దుద్దుకూరు రహదారిలోని లక్ష్మీపురం అడ్డరోడ్డు, దుద్దుకూరు శివారు క్వారీల వద్ద, పంగిడి సమీపంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైయింది. దేవరపల్లి సమీపంలోని పోలవరం కడి కాలువపై వంతెన వర్షపు నీరు తరచూ నిలిచి పోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. పల్లంట్ల-యర్నగూడెం రోడ్డులో హనుమాన్‌ చితల్‌ వద్ద బర్లవాగుకు సంబంధించి కల్వర్టు వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి గండి పడింది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దేవరపల్లి-పల్లంట్ల రోడ్డులో పోలవరం కుడి కాలువ సమీపంలో రోడ్డు గుంతలు పడి దారుణంగా తయరయ్యాయింది. రాత్రి సమయంలో గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దేవరపల్లిలోని సీబీఎస్‌ కాలనీ రోడ్డు బురదగా తయారు కావడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.